

# చేసిన ధర్మం

మధురాంతకం రాజారాం

పాలకన్నా, పాయసం కన్నా, పంచదారకన్నా, కలకండ కన్నా తియ్యనైనది ఏది - అని ఎవరైనా అడిగితే, తటపటాయించకుండా 'పొగడ్త' అని బదులు చెప్పొచ్చు. అవును మరి. పొగడ్తంటే ఇష్టం లేని దెవరికి? 'అనాథ రక్షకా! ఆపద్బాంధవా! ఆర్తత్రాణ పరాయణా!' అనే సరికి భగవంతుడే పరవశించి పోతుండగా లేంది, ఇక మానవులొక లెక్కా? క్రింది ఉద్యోగులు పై అధికారికి మస్కా గొట్టడానికీ, ప్రేమికులు ప్రియురాండ్రను బుట్టలో పెట్టడానికీ తిరుగులేని చిట్కాలుగా పనికొస్తున్నవి పొగడ్తలే గదండీ!

పొగడ్తల సమ్మోహనాస్త్రాల బారికి కొమ్ములు తిరిగిన వాళ్లే గుమ్మైపోతుండగా, పాపం - మల్లెల గురప్ప ఎంతటి వాడు? అతడేమైనా చదువరా? గొప్ప షావుకారా? పేరు మోసిన పెద్ద మనిషా? అదేం కాదు. ఉన్నదంతా అయిదెకరాల చేను. వాన కురిస్తేనే అందులో పంట. ఇన్నాటికి దరిదాపుల్లో వుండే గొర్రెల మంద. నాలుగో అయిదో పాలిచ్చే ఆవులు. రెండు పూరి కొట్టాలు, ఒక చుట్టుగుడిసె. సంతానానికి గూడా కరువొచ్చినట్టుగా ఇద్దరే ఇద్దరు కొడుకులు. ఇంట్లో వంటపనికైనా, పొలంలో సేద్యం పనికైనా, అడవిలో జీవాలను మేపే పనికైనా సరదారైన భార్యను గూడా కలుపుకుంటే అతడి స్థిర, చరాస్తులన్నీ యింతే!

అలాంటి సాదా సీదా సన్నకారు రైతు మల్లెల గురప్ప తన దురదృష్టం వల్లనైతేనేమి, విధి విలాసం వల్ల నైతేనేమి పొగడ్తల వలలో పడిపోయాడు. అతడిలోని ఈ బలహీనతను కనిపెట్టిన వ్యక్తి పేరు రమాకాంత భాగవతారు. దేవళంపేట చింత తోపులో, ధర్మరాజుల గుడి ముందర భారత పురాణ ప్రవచనం చేస్తుండగా భాగవతారుకు మల్లెల గురప్ప తొలిసారిగా తారసిల్లాడు. అప్పుడాయన చెబుతున్న ఘట్టం కర్ణ జననం.

పచ్చి కొబ్బరి మట్టల పందిరి కింద, చల్లటి ఇసుకపైన కూర్చున్న సభాసదుల్లో ఆవులింతలు, కునికిపాట్లు ఉచ్చులు తెంచుకునేటట్టుగా ఒకసారి వారిచేత గోవింద నామ స్మరణ చేయించి, భాగవతారు కథా ఘట్టాన్ని అందిపుచ్చుకున్నాడు.

"మహాజనులారా! వైశంపాయన మునీంద్రుడు జనమే జయునితో ఏమంటున్నాడంటే - విన్నారు గదా. జనమేజయ మహారాజా! ఇవ్విధంబున సూర్య భగవానుని వరం వలన కుంతి భోజుని పుత్రికి సద్యోగర్భంబున కోటి సూర్య ప్రభావిరాజ మానుడైన పుత్రుడు జన్మించిన వాడాయెను. కర్ణ కుండలములతో పుట్టినందున ఆ శిశువు కర్ణుండు నాబరగెను. ఆ కర్ణుడు ఎటువంటి వాడు? కృత

యుగంలో బలి చక్రవర్తి దాత. త్రేతా యుగంలో శ్రీరామచంద్రుడు దాత, ద్వాపరంలో కర్ణుడే దాత. దాత అంటే ఏమిటి? దాత అంటే ఎవరు? నాయనా, నువ్వు దాతవా? బాబూ, నువ్వు దాతవా? అయ్యా, నువ్వు దాతవా?..."

మాపుడు వ్రేలితో నిర్దేశించి తననే నిలదీసి అడుగుతున్నట్టుగా తోచేసరికి బారెడు దూరంలో కూచున్న మల్లెల గురవ్వ తటాలున లేచి నిల్చున్నాడు. జేబులో చెయ్యిపెట్టి దొరికిన ఓ అయిదు రూపాయల నోటు తీసి హరిదాసుగారి చేతిలో పెడుతూ 'దాత, గీత అనొద్దండి సామీ! నేను మల్లెల గురవ్వని' అన్నాడు.

అంతటితో భాగవతారు పుంజుకున్నాడు - "అయ్యలార! దానము, భోగము, నాశము అని డబ్బుకుండేవి మూడే గతులు. నువ్వు డబ్బు కూడబెడతావు. ధర్మం చెయ్యవు. ఏమవుతుంది? ఆ సంపద పరుల పాలు. పోనీ భోగాలనుభవిస్తావు, రోగాలు తప్పవు. కనుక చేసిన ధర్మమే చెడని పదార్థం - అని ఈ విధంగా భావన చేసిన వాడై మహాదాత కర్ణుడు జన్మించిన శుభ సమయంలో 'చేతులకు తొడవు దానము, భూతలనాథులకు తొడవు బొంకమి ధరలో' - అన్నట్టుగా హరిదాసుకు అయిదు రూపాయలర్పించిన పరమ భాగవతోత్తముడు మల్లెల గురవ్వ ఈశ్వరుడెక్కేటి నంది వాహనం తోడు గలిగి, 'పరమాత్ముడెక్కేటి పక్షి వాహనం తోడుగలిగి, దేవాది దేవతల తోడు గలిగి, విక్రమార్కుల వంటి కొమాళ్ళు కలిగి, ధనం ధాన్యం గలిగి సుభోజయంగా వర్ధిల్లు గాక, ఇట్లని దేవదేవుడతని ననుగ్రహించు గాక!"

ఒళ్ళంతా చందనమలదినట్టుగా మల్లెల గురవ్వ పులకించిపోయాడు. ఒక అయిదు రూపాయల నోటు తనది కాదనుకునే సరికి తాను సభా పూజ్యుడైపోయాడు. సభికులనే చుక్కల్లో చందమామైపోయాడు. ఔరా, ఎంత వింత! దాసుగారికి చెయ్యి సాచడంలో యింత మర్యాద వుందా? ఇంత మన్నన వుందా! సరే, దీని అంతేమిటో తేల్చుకో వలసిందే! ఆ మరునాటి నుంచీ గురవ్వ ఒక నుర చెంబు నిండుకూ ఆవు పాలతో సహా పురాణ కాలక్షేపానికి హాజరవుతూ వచ్చాడు. అట్లాగని సభ సింపులకు దీంతో సంబంధం లేదు. దానికదే, దీనికదే! పాలు తానేమీ డబ్బిచ్చి కొనింది కాదు గదా! తాగనీ. అది స్వామికి ప్రత్యేక నైవేద్యం!

పురాణ కథలో ఏ సందర్భాన్నయినా స్వప్రయోజనానికి అనువుగా మలుచుకోడం భాగవతారుగారికి కొట్టిన పిండి అనే విషయం కొందరు అమాయక జీవులకు తప్పితే, చాలామందికి తెలిసిపోయింది. ద్రౌపది వస్త్రాపహరణ ఘట్టంలో మల్లెల గురవ్వ సమర్పించిన సిరు కానుక అందుకుని ఆయన యిలా ముదల కించుకున్నాడు -

"మహాజనులారా! విన్నారు గదా! అప్పటిది దుష్ట


## హాస్టల్లో హృదయం

సందడిగా విరుచుకుపడిన కెరటం
తనలో తానే ముడుచుకుపోయినట్లు-
అవాక్కయి రోదిస్తూ వుంటుంది యిల్లు:

గోడల మీది అల్లిబిల్లి అక్షరాలూ, ఆకృతి లేని ఆకారాలూ
మా 'కృతికర్త' నేం చేశావని నిలేసినట్లుంటాయి.
టివి మీది ఫోటో ఫ్రేం లోంచి పాప నన్ను
తర్జనితో ప్రశ్నిస్తున్నట్లుంటుంది.
రంగుల తెర మీది రస్నా బొమ్మ
ఆడియన్సు లేని ఆడిటోరియంలా వెలవెలబోతుంది
విరిగిన బొమ్మల శకలాలూ, చిరిగిన పుస్తకాల పుటలూ
చెల్లా చెదురైన నా ఆత్మీయతలవుతాయి.
సరంగులేని నౌకకు లంగరు వేసినట్లుగా
మంచం కింద నక్కుతుంది మూడు చక్రాల సైకిలు
ఇడ్లీలోకి పంచదారా, మజ్జిగ లోకి మామిడి పండూ
లేవేమని నన్ను గద్దించేవారుండరు

నేనింతవరకూ 'వున్నదనుకుంటున్న విరాకు' స్థానే నరాకు.

కళ్ళల్లో, కలల్లో నా వైపే చేతులు చాపి చూస్తూ
నన్ను నిదుర పోనీయదు.
మేలుకున్నా-
నన్ను క్షణం నేను నిలువనీయదు
నా దగ్గరలేని నా పాప!



- డాక్టర్ బి. సుధాకర్

దుశ్శాసనుడు ఈడ్చిన కొద్దీ వలువలొస్తూనే వున్నాయి. ఎలా జరిగిందది? కన్నయ్య కరుణ వల్ల జరిగింది. నల్లనయ్య కెందుకు నాయనా అంత కరుణ? చెరుకు తింటుంటే ప్రభువుకు వేలు కోసుకుపోయింది. ద్రుపదరాజ నందన తటాలున చీర చెరగు చించి కట్టుగట్టింది. అంత చిన్న కైంకర్యానికి యింతటి మహోపకారమా అని మీరనుకోవచ్చు. అవునండీ! అదంతే! పెద్ద లేమన్నారు? క్షేత్ర మెరిగి బీజము, పాత్రమెరిగి దానము అన్నారు. పంట కాపు ఏమన్నాడు? అదనుకు అడ్డెడు చల్లితే పుట్టెడు పండుతుందన్నాడు. ఈ ధర్మ సూక్ష్మాన్ని గుర్తెరిగి ద్రౌపదీ మానసంరక్షణ సందర్భంలో హరిదాసుకు అయిదు రూపాయలర్పించిన మల్లెల గురవ్వను ఏమని దీవించగలం? అతడు పట్టింది బంగారమవుగాక! అతడు ముట్టింది ముత్యమవు గాక! అతడి పెరటి చెట్టు కల్పవృక్షమగుగాక! అతడి కొట్టులో గోవు కామధేనువగుగాక! నూరేండ్ల ఆయుష్షు కలిగి, మేడలు మిద్దెలు కలిగి, మనుమలు మనవళ్ళు మనవరాండ్రు కలిగి, అతడు సుభోజయంగా వర్ధిల్లు గాక! అట్లని దేవదేవుడతని ననుగ్రహించును గాక!"

చివరికది ఎక్కడి దాకా వచ్చిందంటే ఈనిలో గురవ్వ ఓడిపోతాడా, స్తోత్ర పాఠంలో భాగవతారు ఓడిపోతాడా అన్నంతవరకూ వచ్చింది. ఎవరూ ఓడిపోయేటట్టు లేరు. హరిదాసు వెనుకా ముందూ చూడకుండా, బారెడు హెచ్చా తక్కువా గమనించకుండా మాటల మూటలు విప్పి మల్లెల గురవ్వ మీద నవ్వు ముందు చల్లుతూనే వున్నాడు - "ఇయ్యగ, ఇప్పించ గల అయ్యలకే గాని మిన మన్యుల కేలా? రొయ్యకు లేదా మీసము - అన్నాడు గదండీ కవి! అనువనుము. మీసమనేది ఎవరి కుండాలి? మల్లెల గురవ్వలాంటి వదాన్య శేఖరులకే వుండాలి! 'కలిమి గల లోభి కన్నను, విలసితముగ పేద మేలు వితరణి యైనన్, చలి చెలమ మేలుగాదా, కుల నిధి అంబోధి కన్న -' అన్నట్టుగా గురవ్వ ఒక ఒక్క రైతు అయితే మాత్రం ఏమండీ! అతడు ప్రతి రోజూ తెచ్చి యిచ్చే గోక్షీరం ఎంత తియ్యనో, అతడి మనసంత తియ్యన. అతడు నివేదించే కానుక, అదే మాకు అనుదిన వేడుక. ధర్మరాజు గావించిన నిరతాన్న దానం నక్తువ్రస్థుడి గంజిమెతుకుల ముందు దిగదుడుపే గదండీ! ఆ కథ యిక ముందు ముందు వస్తుంది. 'చిత్తశుద్ధి కలిగి చేసిన పుణ్యంబు, కొంచెమైన నదియు కొదువ గాదు, విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత' అని వేమన్న గారు చెప్పింది

ఎవర్ని గురించి? ఇదిగో మన గురప్ప లాంటి వాళ్లని గురించి ..." ఇలా మల్లెల గురప్ప తాలూకు కీర్తి కాంతదాసుగారి నాలుకపైన విశృంఖల విజయ తాండవం చేయసాగింది.

పద్దెనిమిది రోజులు గడిచాయి. మహాభారత యుద్ధం పరిసమాప్తికి వచ్చింది. ఆ మరునాటి నుంచీ దేవరంపేట చింతతోపు నిర్జనమై బోసిపోయింది. ఇదంతా మామూలే. కానీ ముల్లె ఏదో చేజారిపోయినట్టు మల్లెల గురప్ప పెద్ద వెలితికి గురి కావడమే విచిత్రం. అతడి కొకటే ఆలోచనైపోయింది. మళ్లీ స్వామి ఎప్పుడు కనిపిస్తాడో! ఆయనది ఏ వూరో! ఆవలింతకూ ఆయన్ను మళ్లీ చూసే ప్రాప్తం తనకుందో లేదో! ఆహా, అవి మాటలా? మాణిక్యాలు గదా!

అయితే ఒకటి. దేశం ఎంత విశాలమైనదైనా అవుగాక! బొందిలో ఊపిరనేది వుంటే పూర్వ పరిచితులైన వారు ఎప్పుడో ఒకప్పుడు ఎక్కడో ఒక చోట కలుసుకునే అవకాశం వుండనే వుంటుంది. దీపావళికి ముందు పండుగ బట్టలు కొనడం కోసం మల్లెల గురప్ప తిరుపతికి వెళ్లి రావడం రివాజు. బట్టల మూట భుజాన పెట్టుకుని బస్సు కోసం వెదుకుతుండగా బస్ స్టేషన్లో అతనికో వ్యక్తి కనిపించాడు. ఆయన చూడ్డానికి వయసులో రమాకాంత భాగవతారుకు అన్నలాగానో, చిన్నాన్నలాగానో వున్నాడు. పళ్లన్నీ వూడిపోయాయేమో, దవడలు లోపలికి పోయాయి. సులోచనాల వెనుక కళ్లు కొడిగట్టిన ఆముదపు దీపాల్లా వెలవెలపోతున్నాయి. తల బట్ట బారిపోయింది. 'ఎవరై వుంటాడబ్బా ఈయన?' గురప్ప తటపటాయిస్తూనే వెళ్లి ఆయన ముందు నిల్చున్నాడు. దాదాపు పదిహేనేళ్లకు ముందు దేవరంపేటలో భారతం చెప్పిన భాగవతారే అయితే ఈయన తనను పలకరిస్తాడు. లేకపోతే లేదు. ఒక చిన్న ఎత్తునేసి చూస్తే తప్పేముంది?

బెంచ్ పైన కూర్చున్న ముసలాయన తనకెదురుగా వచ్చి నిల్చున్న గురప్పకేసి అదే పనిగా కొద్ది క్షణాల వరకు తేరిపార జూచాడు. తెగిన జ్ఞాపకాల మధ్య లింకు తగులుకున్నట్టు వున్నట్టుండి "మల్లెల గురప్పవి గదూ! బాగున్నావా బాబూ?" అని పలకరించాడు.

"స్వామి, మీరేనా? నేనింకా ఎవురో అనుకుంటి. ఇదేమి స్వామీ యిట్టయిపోతిరి! జబ్బు పడిలేస్తిరా ఏంది?" అంటూ వాపోయాడు గురప్ప.

"కాల ప్రభావం నాయనా! రా కూర్చో!" అన్నాడు మాజీ హరిదాసు అంటూ బెంచీ పైన కొంచెం తావు కూడా చేశాడు.

"వొద్దు సామీ! నేనిట్లా గుడ్డల మూట పైన్నే కూచుంటా! మీరు చెప్పండి. ఉండడమెక్కడ? ఇక్కడికెప్పుడొస్తిరి? ఇప్పుడెందాకా ప్రయాణం? బిడ్డ పాపలు బాగుండారా?" అంటూ పరామర్శలు గుప్పించాడు గురప్ప.

## అసిధారా వ్రతం

అంతర్బాహిర్జగత్తులకీ,
చేతనాన చేతనలకీ,
ఇడ్ సూపర్ ఇగోలకీ,
మధ్య;
జీవేచ్ఛకీ మృత్యేచ్ఛకీ,
సహజాతాలకీ సంస్కృతికీ,
వ్యక్తికీ, సామాజికత్వానికీ,
వాస్తవానికీ కాల్పనికతకీ,
'ఈజ్'లకీ 'ఆట్'లకీ,
మధ్య; జీవితం అసిధారా వ్రతం.

—ప్రొఫెసర్ పి.వి. కృష్ణారావు.

"నాయనా, మల్లెల గురప్పా! నువ్విప్పుడడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పడమంటే నా జీవిత చరిత్రంతా చెప్పడమే! చెప్పాలనే వుంది. కానీ ఎవరి బస్సు ఎప్పుడొస్తుందో తెలియదు. నీ బస్సొస్తే నువ్వు, నా బస్సొస్తే నేను వెళ్లక తప్పదు. నాయనా గురప్పా! అసలైన వేదాంత సారమంతా అదే! నేను మాట దెబ్బ ఆరుసార్లు రారాజు సుయోధనుణ్ణి వధించాను. ధర్మరాజును కూడా అన్నిసార్లు స్వర్గానికి సాగనంపాను. అంటే మాట దెబ్బ ఆరు సార్లు మహాభారత ప్రవచనం చేశానన్నమాట! కానీ ఏం లాభం? కూరలో వున్నంత మాత్రాన గరిటకు రుచి తెలిసి ఏడ్చిందా? ఆ కొన్న పెద్దపులి అడవిలో కనిపించిన మృగాన్నంతా చంపితిన్నట్టుగా, నీతుల్ని చెప్పి చెప్పి, పొగడ్తలు రువ్వి రువ్వి, అయిన డబ్బంతా దోచుకొచ్చి వెయ్యేండ్లో, లక్షేండ్లో బతికిపోవాలనుకున్నాను. నా సంపాదనంతా పెట్టుబడిగా పెట్టి కొడుకుల్ని విక్రమార్కులుగా చేసెయ్యాలనుకున్నాను. పెద్దవాడు సముద్రాంకవతల అమెరికాలో స్థిరపడి ఇరవైయేళ్లయింది. వాడక్కడే ఓ అమెరికా అమ్మాయిని చూసుకొని, ఆ దేశపు పౌరసత్వం పుచ్చుకున్నాడు. తల్లిపోయిందని రాస్తే వాడొక సానుభూతి సందేశాన్ని యస్.టి.డి.లోనే చెప్పేశాడు. రెండో వాడు హర్యానాలో ఇంజనీరు. వాడి భార్య గూడా అక్కడ లెక్చరరు. తామూ, తమ బిడ్డలూ పల్లెటూరికి వచ్చి, కొద్ది రోజులక్కడ గడపడం సాధ్యం కాదని వాళ్లు తెగేసి చెప్పేశారు. మూడో వాడు ఉత్తర ఈశాన్య రైల్వేలో పెద్ద ఉద్యోగి. నేను గనుక అక్కడికి వెళ్లి తన దగ్గరుండి పోతే సాకడానికి అభ్యంతరం లేదని వాడేమో అభయమిచ్చేశాడు. ఆ భాష నాకురాదు. వారి భార్యా బిడ్డలు కూడా తెలుగు మాట్లాడరు. మూగజీవంలా నేనక్కడ ఎలా జీవించగలను? పోగా నాలుగో వాడు కాస్త నయమేమోనని అనుకుంటూ వచ్చాను. ఆ ఆశకూడా నిన్న మొన్నటికి అడుగంటింది. వాడికో రెండేళ్ల కూతురుందిలే! ఆ పిల్ల కళ్లల్లో మెదిలినట్టుంటే చూసొద్దామని రేపల్లె నుంచి బయల్దేరి, అయిదు వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి, బెంగుళూరు చేరుకున్నా. ఇంటికి వెళ్తే వాడా యిల్లు ఖాళీ చేసి మూడు నెలలైనట్టు తెలిసింది. బ్యాంకుకు వెళ్ళి వాకబు చేశా. వాడు పూనాకు బదిలీ అయి నాలుగు నెలలైనట్టు తెలిసింది. ట్రాన్స్‌ఫరైనట్టు ఓ కార్డు ముక్క రాసే ఓపిక వాడికి లేకపోయింది. అక్కడికి తెల్లవారింది నా బతుకు. అతిగతి పట్టించుకునే వాళ్లు లేకపోయారు. పురుషార్థమెట్లాగూ లేకపోయింది. పుణ్యమైనా దక్కించుకుందామని తిరుగు ప్రయాణంలో తిరుపతి యాత్ర పెట్టుకున్నా..."

కొద్ది నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి. "పోనీలే, నువ్వెలాగున్నావు గురప్పా?" అని ఈసారి హరిదాసే అడిగాడు.

"ఆ మాటెందుకులే సామీ! నా కొడుకులు నన్నట్లా వదిలిపెట్టే రకం గాదు. కయ్యిలో తొలి మడక నేను కట్టాల్సిందే! సాళ్లో తొలిగింజ నేనెయ్యాల్సిందే! పంట దేవరకు పొంగలి పెట్టాలన్నా, పంట కళ్లంలో మేర గింజలు కొలవాలన్నా, ఏ వస్తువు కొనాలన్నా, ఏ సరుకు అమ్మాలన్నా నేనో, నా పెళ్ళామో ముందుండాల్సిందే! అంతా మీ దీవెన ఫలితం సామీ! లేకపోతే బోరు యేస్తే తొండంతో చిమ్మినట్టు నీళ్లు దూకేనా? తొండలు గుడ్లు పెట్టే నవిటి పర్ర మొదటి రకం మారేదేనా? పూరి కొంపలు మిద్దెలయ్యేనా? మీ వాక్కు బ్రహ్మ వాక్కు. మీరెంత చెబితిరో, అంతా జరిగింది" హఠాత్తుగా ఏదో జ్ఞాపకం వచ్చినట్టు తటాలున లేచి నిల్చున్నాడు గురప్ప. "ఒక యిన్నపం సామీ! మళ్లీ తమర్ని చూసే అదృష్టం నాకుందో, లేదో! నా దగ్గిర యిది వుంది. ఇదే పది వేలని మీరు పుచ్చుకోవాలి! నిండు మనసుతో దీవించాలి!" అన్నాడు.

భాగవతారు కళ్ళల్లో కన్నీళ్లు గిర్రున తిరిగాయి.

"నాయనా, గురప్పా! నువ్వు బాగున్నావు. నీ బిడ్డలు బాగున్నారు. నీ సంసారం పాలు పొంగినట్టుగా పొంగుతూ వుంది. మీరు మనుషులుగా పుట్టి మనుషులుగానే జీవిస్తున్నారు. చాలా ఆనందంగా వుంది నాయనా, బ్రహ్మానందంగా వుంది. నువ్వేదో యివ్వదలిచి నన్ను పుచ్చుకోమంటున్నావు. నువ్వివ్వడానికీ, నేను పుచ్చుకోవడానికీ యిదేమైనా మొదటిసారా? నా బోటి వాళ్లకు నువ్వు కానుకలిస్తావు. ప్రజా నాయకులడిగితే వోట్లిస్తావు. పనిచేసి పెట్టిన వాళ్లడిగితే బక్షీసులిస్తావు. ఇంటిముందరికి వచ్చి 'దేహీ' అని ఎవరు చెయ్యి సాచినా నీకున్నది అంతో యింతో పెట్టి పంపిస్తావు. ఇంటికి తల్లి ఎలాగో, దేశానికి నువ్వలాగు! నీ పాడిలో, నీ పంటలో నువ్వు చల్లగా వర్ధిల్లాలి. నీ సుఖమే దేశానికి సుఖము. నీ జయమే లోకానికి జయము. వెళ్లిరా బాబూ, వెళ్లిరా!" అన్నాడు భాగవతారు. ●